ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 30 ఆగస్టు 2025



• బాలికల వసతి గృహం

జేఎన్టీయూపై శీతకన్ను

ఎక్కడికక్కడే నిలిచిన నిర్మాణాలు

- ఏళ్లుగా సాగుతున్న కళాశాల పనులు
- నిధుల విడుదలపై వర్సిటీ మీనమేషాలు
- అక్టోబరు కల్లా వసతి అన్న వీసీ ప్రకటనకే పరిమితం
- రూ.44.2 కోట్ల ప్రతిపాదనలపై పాలకమండలి నిర్లక్ష్యం

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- అక్టోబరు కల్లా వసతి గృహ భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని జేఎన్టీయూ వీసీ గతంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- జేఎన్టీయూ కళాశాల భవన నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి.
- క్రీడా ప్రాంగణ భవనాల నిర్మాణం సగంలోనే ఉంది.
- పరిపాలన, ప్రయోగశాలల నిర్మాణాలను ఆరేళ్లుగా సాగదీస్తున్నారు.
- కళాశాల తరగతులకు సంబంధించి మూడు ఫ్లోర్లలో రెండు ఫ్లోర్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మరో ఫ్లోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్



పూర్తికాని కళాశాల భవనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రభుత్వ రంగంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరసరావుపేటలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటైంది. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చిందని.. పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో కళాశాల ఏర్పాటుతో పల్నాడు జిల్లా అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారు. అయితే ఇక్కడ పేరుకు కళాశాల ఏర్పాటు చేసినా జేఎన్టీయూ స్థాయిలో నిర్మాణాలు, సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా నిర్మాణ పనులు సాగుతుండటంతో అసలు ఎప్పటికి కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందో తెలియక.. ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కేటాయింపులో పాలక మండలి నిర్లక్ష్యం వందలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలపై వర్సిటీ పెద్దలు శీతకన్ను ప్రదర్శిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నిధుల లేమితో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణాలకు సంబంధించి కమిటీలు రూ.44.2 కోట్ల (మిగతా 6వ పేజీలో)

అధికారుల మరణ శాసనం

- అన్నదాత సుఖీభవతో వెలుగులోకి
- నెపాన్ని ఒకరిపై ఒకరు వేసుకుంటున్న శాఖలు
- అన్నదాత నగదు జమపై గ్రీవెన్స్‌కు 4731 అర్జీలు

గడువు ముగిసినా తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అధికారుల మరణశాసనం ఇది. నిక్షేపంగా బతికి బాగున్న వారిని చంపేసిన వైనమిది. తమను అధికారులు చంపేసి రికార్డుల్లో నమోదు చేశారన్న విషయం సంబంధిత వ్యక్తులకు కూడా తెలియకపోవడం విశేషం. తీరా అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాకపోవడంతో బాధితులకు అసలు విషయం బోధపడలేదు. మరణించినట్లుగా రికార్డుల్లో ఉండటంతో అన్నదాత సుఖీభవ సొమ్ము చాలా మందికి జమ కాలేదు. బతికుండగానే చనిపోయిన జాబితాలో ఎక్కిన బాధితుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అలా



Check Status

Status Found

Name	అంబటి భారతి దేవి
District	బాపట్ల
Mandal	యద్దనపూడి
Village	గన్నవరం
Status	Ineligible
Remarks	Person Death, Recorded in CRS Portal

*Disclaimer: This information is fetched live from the Andhra Pradesh Annadathasukhibhava portal. We do not store or share any details. Always verify with the official website.

Also Read: Annadata Sukhibhava Beneficiary List

నాకు న్యాయం చేయాలి



నేను నిక్షేపంగా ఉన్నాను. అయినా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు తప్పు సరిచేస్తారా అంటే అదీ లేదు. ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

- అంబటి భారతీ దేవి, బాధితురాలు

ఎలా జరిగిందని రెవెన్యూ అధికారులను అడిగితే తెలియదని సమాధానం దాటేస్తున్నారు. ఇదేందని వ్యవసాయ శాఖని నిలదీస్తే అసలు తమకు సంబంధమే లేదంటున్నారు. తప్పు జరిగిన తర్వాత కూడా గ్రీవెన్స్‌లో బాధితులు దరఖాస్తు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది.

నిక్షేపంలా ఉన్న భారతీదేవి..

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన అంబటి భారతీదేవికి వ్యవసాయ భూమి ఉంది. అన్నదాత సుఖీభవ సొమ్ము ఆమెకు జమ కాలేదు. అధికారులను సంప్రదిస్తే మృతి చెందినట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు తేలింది. ఇదెలా జరిగిందని వీఆర్వోను ప్రశ్నిస్తే తెలియదన్నారు. జీవించి ఉన్నట్లుగా సర్టిఫికెట్ తీసుకుని తహసీల్దారు, వ్యవసాయ అధికారికి భారతీదేవి చూపించినా (మిగతా 6వ పేజీలో)

సెక్యూరిటీగార్డు అనుమానాస్పద మృతి

హత్యేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ



చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిధి లోని సాల్మన్ సెంటర్‌లో ఓ సిమెంట్ ఖార్ఖానాలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న దివ్యాంగుడైన ఇంటూరి స్వామిదాస్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. అయితే హత్యేనని ఆరోపిస్తు చీరాల ఏరియా వైద్యశాల వద్ద కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాండ్రపేట హస్తినాపురానికి చెందిన స్వామిదాస్‌కు పుట్టుకతోనే మూగ, చెవుడు. ఇతడికి భార్య కృప, కుమార్తె (మూగ, చెవుడు), కుమారుడు సంతానం. కాగా స్వామిదాస్ ఐదేళ్లుగా సాల్మన్‌సెంటర్ బేర్ గార్డెన్‌లో తోటమాలిగా పగలు, సమీపంలోని ఓ సిమెంట్ ఖార్ఖానాలో రాత్రి పూట సెక్యూరిటీగార్డు పనిచేస్తున్నా డు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో అస్వస్థతకు గురైనట్లు స్వామిదాస్ నోటినుంచి నురగ వస్తుందని ఖార్ఖానా నుంచి కుటుంబసభ్యులకు కబురు వచ్చింది. వారు అక్కడకు చేరేసరికి అతడు చనిపోయాడు. మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. అప్పుడు గమనించగా రక్తపు గాయాలను గుర్తించిన కుటుంబ సభ్యులు స్వామిదాస్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. భర్త మృతిపై సందేహాలు ఉన్నట్లు భార్య కృప, బంధువులు ఆరోపించారు. ఘటనపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ఎట్టకేలకు భూసేకరణకు అనుమతి

- పట్టాలెక్కనున్న గుంటూరు ఛానల్ పొడిగింపు

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన భూసేకరణ చేసేందుకు అన్ని అనుమతులు లభించాయి. దాంతో గుంటూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారులు రెండు రోజుల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. రెవెన్యూ అధికారులు 60 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరించి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్ల నున్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని ప్రాజెక్టుకు అవసరమైన పరిపాలన అనుమతులను ఒక్కొక్కటిగా ఇప్పిస్తున్నారు. దీంతో అధికారుల పని సులువుగా మారింది. నాలుగు దశల్లో విడుదల కావాల్సిన నిధుల్లో తొలిదశ కింద రూ.30.5 కోట్లు ఇప్పటికే జిల్లా ఖజానాకు చేరాయి. గుంటూరు జిల్లాలోని మూడు మండలాల్లో (వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు)ని 11 గ్రామాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ పనులు జరగనున్నాయి.. ఇందులో విభజిత గుంటూరు జిల్లాలోని 7 గ్రామాల్లో 201.149 ఎకరాల భూసేకరణ నిమిత్తం ప్రస్తుతం పీఎన్ జారీ చేశారు. మిగిలిన నాలుగు గ్రామాలకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంది. భూసేకరణకు రూ.100 కోట్లను విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుతో పాటు జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రాజెక్టుకు రూ.75.12 కోట్లు మంజూరు కాగా తొలి దశలో రూ.30.5 కోట్లు, రెండో దశలో రూ.12.9 కోట్లు, మూడో దశలో రూ.18.33 కోట్లు, చివరి విడతలో రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని పెమ్మసాని తెలిపారు.

బీచ్ ఫెస్టివల్‌కు భారీగా ఏర్పాట్లు చేయాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యలంక సముద్రతీరంలో మూడురోజులు నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు భారీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. ఈ ఫెస్టివల్‌కు సంబంధిం చి శుక్రవారం పర్యాటకశాఖాధికారులతో కలెక్టర్ కలెక్టరేట్‌లో సమీక్షించారు. సూర్యలంక సముద్ర తీరంలో వచ్చే నెల 26, 27, 28 తేదీల్లో జరిగే బీచ్‌ఫెస్టివల్‌కు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీచ్ క్రీడలు, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా కార్యక్రమాలు ఉండేలా ప్రణాళిక రూపొందిం చాలన్నారు. లేజర్ షో, సాహసోపేత విన్యాసాలు, గాలిపటాలు ఎగురవేయడం, విద్యార్థులకు పోటీలు, సెల్ఫీపాయింట్లు మొదలైనవి ఏర్పాటు చేయాలన్నారు. ఆహారప్రియులను ఆకట్టుకునేవిధంగా ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజుల ఫెస్టి వల్‌లో భాగంగా 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూర్యలంక బీచ్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. రామాపురం బీచ్‌లో కూడా మూడురోజులు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం అధికారులతో కలిసి సూర్యలంక తీరాన్ని కలెక్టర్ సందర్శించారు. వేడుకల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఎస్పీ తుషార్‌డూడి, పర్యాటక శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లక్ష్మీప్రసన్న, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, బాపట్ల పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, పర్యాటకశాఖాధికారులు

రూ.2 కోట్ల పనులకు ఆమోదం

27 అంశాలు ఏకగ్రీవం

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చీరాల మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో డ్రెయిన్లు, పారిశుధ్యం, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలో సౌకర్యాలకు సంబంధించి రూ.2 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 29 అంశాలు అజెండాలో ఉంచగా 27 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్ని వార్డుల్లో పారదర్శకంగా అభివృద్ధి పనులు జరగాలని బొనిగల జైసన్‌బాబు తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నట్లు చైర్మన్ వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని ఐదు నెలల్లో చేస్తామన్నారు. వార్డుల్లో కుక్కల బెడదతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య తెలిపారు. సమావేశంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, టీపీవో గీత తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సాంబశివరావు, కౌన్సిలర్లు, అధికారులు

రోడ్డు వేసి బస్సు రప్పించండి

- రోడ్డుపై కాలనీ వాసుల నిరసన

పర్చూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి 167 (ఏ) నిర్మాణంతో పర్చూరు మండలం చెన్నుంబొట్లఆగ్రహారంకాలనీ పాత రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కాలనీకి బస్సు సౌకర్యం కూడా నిలిచిపోయి రాకపోకలకు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేసి యథావిధిగా బస్సుల రాకపోక లు కొనసాగించాలని పర్చూరు బొమ్మల సెంటర్‌లో కాలనీవాసులు నిరసన తెలిపారు. బస్సులు రాకపోవడంతో విద్యార్థులను పాఠశాలకు పంపించడానికి ఇబ్బంది పడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంతోపాటు, కాలనీ నుంచి కూడా బస్సులు రాక పోకలు సాగించేలా చూడాలన్నారు. పోలీసులు నచ్చచెప్పడంతో కాలనీ వాసులు నిర సనను విరమించారు. వీరికి సీపీఎం నాయకులు పి.కొండయ్య, మత్తే డేవిడ్, దళిత నాయకుడు నలిగిల కిశోర్ సంఘీభావం తెలిపారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

బార్లు మాకొద్దు.. బాబోయ్



- అరకొరగానే దరఖాస్తులు
- గడువు పెంచినా కొరవడిన స్పందన
- ఎక్సైజ్ అధికారుల ప్రయత్నాలు విఫలం
- మూడో వంతు బార్లకు అందని దరఖాస్తులు
- బాపట్ల జిల్లాలో నాలుగు బార్లకే పూర్తిస్థాయిలో..
- గుంటూరు జిల్లాలో 35, పల్నాడు జిల్లాలో 16 అర్హత
- నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన బార్లకు నేడు లాటరీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బార్లు అంటే మద్యం వ్యాపారులు భయపడుతున్నారు. గడువు పొడిగించినా బార్లకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే తొలుత ఇచ్చిన గడువు ఈ నెల 26 కాగా స్పందన మరీ పేలవంగా ఉండడంతో శుక్రవారం వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు ఎక్కడికక్కడ వ్యాపారులతో ఎలాగైనా బార్లకు దరఖాస్తులు చేయించాలని పలు ప్రయత్నాలు చేశారు. అయినా వ్యాపారులు ముందుకు రాలేదు. శుక్రవారం రాత్రి గడువు ముగిసేప్పటికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మూడో వంతు బార్లకు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు రాలేదు. లాటరీ ప్రక్రియ జరగాలంటే ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు రావాలనే నిబంధనను పెట్టింది. మూడు జిల్లాల్లో మొత్తం 178 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా గడువు ముగిసేప్పటికి 55 బార్లకు మాత్రమే పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుంతో పాటు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు కూడా భారమవుతుందని, వైన్ షాపులకు పర్మిట్ రూములతో లాభాలు కష్టమని వ్యాపారులు బార్ల వ్యాపారానికి మొగ్గు చూపలేదని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి దరఖాస్తు సమయంలోనే (మిగతా 6వ పేజీలో)

ఏషియన్ షూటింగ్ పోటీల్లో మెరిసిన ముకేష్



పత కాలతో ముకేష్

గుంటూరు(క్రీడలు) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కజకిస్థాన్‌లోని షెమ్కెంట్ నగరంలో శుక్రవారం ముగిసిన ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు కు చెందిన నేలవల్లి ముకేష్ మూడు బృంద బంగారు పతకాలతో పాటు ఒక వ్యక్తిగత కాంస్య పతకం సాధించాడు. జూనియర్ విభాగంలో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో తన సహచరులతో కలిసి మూడు బంగారు పతకాలు సాధించాడు. టోర్నీ చివరి రోజైన శుక్రవారం 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యంతో పాటు టీమ్ విభాగంలో సూరజ్ శర్మ, అభినవ్ చౌదరితో కలిసి మరో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా ముకేష్‌ను కాస్త రైఫిల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నలలిత్, రాజ్ కుమార్ కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరి కిషోర్ అభినందించారు.

టీడీపీ నేత కొల్లి లక్ష్మయ్య హఠాన్మరణం



కొల్లి లక్ష్మయ్య చౌదరి

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి లక్ష్మయ్య చౌదరి (60) హఠాన్మరణం చెందారు. అనారోగ్య కారణాల రీత్యా గత కొంత కాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా వుంటున్నారు. గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన లక్ష్మయ్య చౌదరిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. లక్ష్మయ్య చౌదరి నవులూరు గ్రామ సర్పంచ్‌గా, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా, ఎర్రబాలెం ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావుకు సన్నిహితంగా వుంటూ మంగళగిరి నియోజకవర్గ టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్మయ్య చౌదరి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అధికారుల.. మరణ శాసనం

(5వ పేజీ తరువాయి)

ఆమెకు ప్రయోజనం దక్కలేదు. భారతీదేవిలా చాలామంది వృద్ధులను మృతుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు బాధితులు ముందే మేల్కొని సరి చేయించుకున్నారు. చాలామందికి విషయం తెలియక ఆలస్యం గా అధికారులను సంప్రదిస్తున్నారు. ఇలా మృతి చెందినట్లు చూపించిన వారి సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు వాపోతున్నారు.

గడువు ముగిసినా...

అన్నదాత సుఖీభవ పథకం అమలులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి వినతుల స్వీకరణకు ఈ నెల 20 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 967, పల్నాడు జిల్లాలో 2145, బాపట్ల జిల్లాలో 1617 మంది అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువ శాతం మండల వ్యవసాయ అధికారులు క్లియర్ చేశారు. పల్నాడు జిల్లాలో 1952, గుంటూరు జిల్లాలో 918, బాపట్ల జిల్లాలో 1310 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ లాగిన్‌కి వెళ్లిన అర్జీలలో చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో తహసీల్దారు లాగిన్‌లోకి 56 అర్జీలు వెళ్లగా కేవలం 15 మాత్రమే పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 19 అర్జీల్లో 3, బాపట్ల జిల్లాలో 46 అర్జీల్లో 23 మాత్రమే తహసీల్దార్లు పరిష్కరించినట్లు సమాచారం.

ముగిసిన మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



చంటి బిడ్డతో హాజరైన అభ్యర్థి



ఏసీ కళాశాలలో హాజరైన అభ్యర్థులు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గుంటూరు (విద్య) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు పది క్యాడర్లలో 1,650 పోస్టులకు గాను గురువారం 930 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కాగా శుక్రవారం 718 మందికి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు అధికారులు తెలిపారు. 36 మంది దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక సర్టిఫికెట్లు, సామర్థ్య పరిశీలన నిర్వహించారు.

ఒంగోలు జాతి పశుసంపదను సంరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి పశు సంపదను సంరక్షించు కోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడులో జాతీయ స్థాయి నందమూరి తారక రామారావు మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బండ లాడుగు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటలతో పాటు పశు పోషణ కూడా చేయాలన్నారు. పశుపోషణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తుందన్నారు. నియోజకవర్గ జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నక్కల అగస్టియన్, కల్లూరి శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి, గింజుపల్లి శివ రామప్రసాద్, పమిడి శ్రీనివాసరావు, కాకాని సురేష్ బాబు, తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, మలినేని పెరుమాళ్ల పాల్గొన్నారు.

సత్తా చాటిన పల్నాడు ఎడ్ల జత

ఒంగోలు జాతి ఎడ్ల బండలాడుగు పోటీలు.. తొలి రోజు పాల పళ్ల విభాగంలో హోరా హోరీగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుంచి 22 జతల ఎడ్లు బరిలో నిలిచాయి. పల్నాడు జిల్లా కావురు లింగంగుంట గ్రామానికి చెందిన మైలా త్రివేణి ఎడ్ల జత 3,900 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం నంగేగడ్డ, నాగాయలంక గ్రామాలకు చెందిన ముమ్మా ప్రభు కుమారి, సంకా పవన్‌ల ఎడ్ల జతలు 3779.7 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం, పడమర గంగవరం గ్రామానికి చెందిన బంకా గురవారెడ్డి ఎడ్ల జత 3614.4 అడుగుల దూరం తృతీయ స్థానంలో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామానికి చెందిన పయ్యావుల నాగేశ్వరరావు ఎడ్ల జత నాలుగవ స్థానంలో, గుంటూరు జిల్లా పిరంగిపురం మండలం, కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎద్దు, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, తోటరావులపాడు గ్రామానికి చెందిన కోటి రాజ్యం ఎద్దు జత ఐదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను ప్రదానం చేశారు.

డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించాలి

● మార్క్ ఫెడ్ ఎండీకి చైర్మన్ హరిబాబు విజ్ఞప్తి



మార్క్‌ఫెడ్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ హరిబాబు, బీఎం

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించి అండగా నిలవాలని చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు మార్క్ ఫెడ్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలానీ సమూన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజధానిలో మార్క్ ఫెడ్ ఎండీని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హరిబాబు నాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు మేలు చేసేందుకు గుంటూరు జిల్లా డీసీఎంఎస్ సంస్థకు ఎక్కువ మొత్తంలో యూరియా, ఎరువులను పంపిణీ చేసేందుకు సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు కేంద్రంలోని ఉన్నతాధికారులతో నిరంతరం చర్చిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన గుంటూరు జిల్లాకు ఎరువులను కేటాయించాలని అభ్యర్థించిన వెంటనే మంచి హృదయంతో స్పందించిన ఏపీ మార్క్ ఫెడ్ ఎండీకి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



చింతా మోహన్

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని, దేశానికి ఇది మంచి పరిణామం కాదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను దెబ్బ కొట్టాలని కుట్రతో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిసి ఈ బిల్లును రూపొందించారని మండిపడ్డారు. కమ్యూనిస్టులు ప్రతిరోజూ ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తుంటారని, 30 రోజులు జైలులో పెడితే చట్టసభలకు ప్రాతినిత్యం కోల్పోవాలా అని ప్రశ్నించారు. దేశంలో పది మంది ముఖ్యమంత్రులపై కేసులున్నాయని ఎన్నికల అఫిడవిట్‌లలో ఉన్నాయన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మీపై వైసీపీ వ్యక్తిగత విమర్శలు హేయమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఎక్కడ సంతకాలు పెట్టమంటే, అక్కడ పెట్టి శ్రీలక్ష్మి జైలుకు పోయారని గుర్తుచేశారు.

బార్లు..మాకొద్దు బాబోయ్

(5వ పేజీ తరువాయి)

రూ.5,10,000 చెల్లించాల్సి ఉండడం వెనకడుగుకు కారణంగా ఉంది. తొలుత ఇచ్చిన గడువు పెంచడంతో పాటు, ఆశావహులతో సమావేశాలు, ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారితో దరఖాస్తుల వేయమనే సంప్రదింపులు ఇలా అన్ని వైపుల నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించినా గడువు ముగిసే సమయానికి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం కలెక్టరేట్ వేదికగా బార్ల లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తు దారులంతా ఉదయం 8 గంటలకే ఆయా కలెక్టరేట్లకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వాటి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందున్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

● బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నాలుగు బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలో ఓ బార్‌కు 5, చీరాలలో ఓ బార్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. రేపల్లె, బాపట్లలో గీత కార్మికులకు బార్లు కేటాయించగా రేపల్లెలోని బార్‌కు లాటరీ తీయడానికి కావాల్సిన దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో నాలుగు బార్లు మాత్రమే లాటరీకి అర్హత సాధించాయి.

● గుంటూరు జిల్లాలో 110 బార్లకు గడువు ముగిసేటికి 48 దరఖాస్తులు వచ్చాయి. 35 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వీటికి మాత్రమే లాటరీ నిర్వహణకు అర్హత సాధించాయి. జిల్లాలో గౌడ సంఘానికి పది బార్లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. కేటాయించిన పది బార్లకు లాటరీ అర్హత పొందాయి.

● పల్నాడు జిల్లాలో 49 బార్లకు 65 దరఖాస్తులు వచ్చాయి. అందులో కేవలం 16 బార్లకు మాత్రమే లాటరీ నిర్వహించే అర్హత ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ సంఘానికి ఐదు బార్ల కేటాయించగా, 22 దరఖాస్తులు వచ్చాయి. ఐదు బార్లు లాటరీ నిర్వహించేందుకు అర్హత పొందాయి.

జేఎన్టీయూపై శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

కేటాయింపునకు ఆమోదం తెలిపాయి. అయితే వర్సిటీ పాలక మండలి ఆ నిధుల విడుదలపై కనికరం చూపడంలేదు. బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహాల పనుల పూర్తికి, 500 మీటర్ల పొడవును ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.11.20 కోట్లు విడుదల చేస్తేనే వసతిగృహాల పనులు ముందుకు సాగుతాయి. వెంటనే నిధులు విడుదల చేస్తే కనీసం రెండు మూడు నెలల్లో వసతిగృహాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై నేటి వరకు వర్సిటీ నిర్ణయం తీసుకోలేదు.

అరకొర వసతులతోనే నిర్వహణ

ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన జేఎన్టీయూ కళాశాలలో అరకొర వసతులతోనే నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా కేవలం తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం జరగలేదు. రూ.33 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే కళాశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించి పాలక మండలి ఆమోదం తెలిపి ఏడాది అయినా నిధులు విడుదల కాలేదు. వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన కళాశాల కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి సాధిస్తుందని, వసతులు సమకూరుతాయన్న విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. కనీసం వసతి గృహాలను పూర్తి చేసి వినియోగం లోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కొడుక్కి జైలుశిక్ష

పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుక్కి.. కింది కోర్టు విధించిన శిక్షను 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. గురజాలకు చెందిన నల్ల పెదరాములు తనకున్న 5 ఎకరాలలో రెండున్నర ఎకరాలు తన కొడుకు శ్రీనివాసరావుకు రాసి ఇచ్చాడు. మిగిలిన భూమిని తన పోషణ నిమిత్తం తన వద్దనే ఉంచు కున్నాడు. కొడుకు శ్రీనివాసరావు ఆ భూమి కూడా తనకే రాసివ్వాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేయసాగాడు. అంతేకాకుండా కౌలు దారులను కూడా బెదిరింపులకు పాల్పడ్డాడు. 2015 జూలై 12న ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులపై కర్రతో దాడి చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావుపై నమోదైన కేసులో.. దిగువ కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ప్రియదర్శిని ముద్దాయి అప్పీల్‌ను డిస్మిస్ చేశారు. ఏపీపీ సూర్యరాజు వాదనలు వినిపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

దూరవిద్యలో.. పీజీ ప్రవేశాలకు ఏఎన్‌యూ ఆహ్వానం

● 23 పీజీ కోర్సులకు యూజీసీ అనుమతి

● సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీసీ గంగాధరరావు, కళాశాల ప్రతినిధులు

ఏఎన్‌యూ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం (ఏఎన్ యూ) సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూజీసీ, డెబ్(డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) 23 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. కోర్సులు, కాల వ్యవధి, విద్యా అర్హతలు, ఫీజులు తదితర వివరాలకు 0863-2346222, 98484 77441 నంబర్లను సంప్రదించాలని సీడీఈ డైరెక్టర్ తెలిపారు.

21న ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు-2025 షెడ్యూల్ విడుదలైంది. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులుగా గుర్తిస్తారు. సెప్టెంబర్ 21న ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఐసెట్‌లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు నేరుగా ప్రవేశం పొందవచ్చు.

కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాలతో అవగాహన ఒప్పందం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - విజయవాడ, కాకినాడలోని కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు సమక్షంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, కేఐఎఫ్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం పత్రంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా వర్సిటీలో ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ రంగాల్లో నాలుగు సంవత్సరాల బీఎస్సీ ఆనర్స్‌తో పాటు ఏడాది కాల పరిమితితో కూడిన డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించనున్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, కేఐఎఫ్టీ విద్యా సంస్థల చైర్మన్ కె.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు కూలీ మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వస్తున్న కారు ఢీకొని రైతు కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ శివయ్య వివరాల మేరకు.. భట్టిప్రోలు పంచాయతీ అద్దెపల్లి గ్రామానికి చెందిన రంగిశెట్టి జయచంద్రరావు (55) సైకిల్‌పై జాతీయ రహదారిలో తాగునీరు తీసుకుని పొలానికి వెళ్తున్నాడు. రేపల్లె వైపు వేగంగా వస్తున్న కారు జయచంద్రరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

హత్యాయత్నం కేసులో జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువు అవడంతో నిందితులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ స్థానిక అదనపు సహాయ సెషన్స్ న్యాయాధికారి ఎస్.లావణ్య శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీరశ్రీ నాగ వెంకట సత్యనారాయణ, సీహెచ్ నాని, ఎం.చిన్న వెంకయ్య, రామిశెట్టి రవి, వి.ఈశ్వర వరప్రసాద్, ఎస్.భవాని శంకర్, మరికొంత మంది ఓ కుల సంఘం పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు కుల సంఘానికి నిధులను సమీకరిస్తుంది. నిధులు దుర్వినియోగం అవుతున్నాయని చిలకలూరిపేటకు చెందిన తోట నాగవేణు గ్రూపులో స్పందించాడు. దీంతో ఆగ్రహించిన గ్రూపులోని సభ్యులు 2021 జనవరి 29న చిలకలూరిపేటకు వచ్చి నాగ వేణు గృహంలోకి అక్రమంగా ప్రవేశించి హత్యయత్నానికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వాళ్లు రావడంతో నిందితులు అక్కడ నుంచి పారిపోయారు. ఈ మేరకు నాగ వేణు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో గత నెల 24న నేరం రుజువైనట్లు న్యాయాధికారి ప్రకటించారు. నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారంటు జారీ చేశారు. అయితే వారు స్వచ్ఛందంగా శుక్రవారం కోర్టులో లొంగిపోయారు. ప్రాసిక్యూషన్‌గా ఏపీపీ గుండాల సురేష్ బాబు, ఎస్సై ఎం.మోహన్ కేసు దర్యాప్తు చేశారు.

వినుకొండలో.. పట్టపగలు చోరీ



పగలగొట్టిన బీరువా

వినుకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విష్ణు కుండినగర్‌లో నిత్యం రద్దీగా ఉండే రామాలయం వద్ద పట్టపగలే శుక్రవారం దోపిడీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. రామాలయం వద్ద నివాసం ఉండే గద్దె వెంకట్రావు బజారుకెళ్లగా, భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. అదును చూసిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో నల్లపూసల గొలుసు, బంగారు చైన్, రెండు ఉంగరాలు, రూ.10 వేల నగదు దొంగిలించుకెళ్లారు. వారం క్రితం ఇదే రామాలయం బజారులో దొంగతనానికి ప్రయత్నించిన దొంగలే ఈ దొంగతనం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

కలెక్టరేట్‌లో ఎరువుల మానిటరింగ్..

కంట్రోల్ రూం ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ఎరువుల మానిటరింగ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. రైతుల ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 8247040131గా ప్రకటించారు. యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో లేకపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూళ్ళు చేసినా ఫిర్యాదు చేయాలన్నారు. నకిలీ ఎరువు విక్రయించినా, కృత్రిమ ఎరువుల కొరత సృష్టించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.


బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 50మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 25,47,553 రూపాయల చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైద్యఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు అర్జీలు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. ప్రజలు నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి ఒక్కరి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం బాపట్ల ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది. 22మంది కమిటీతో ఏర్పాటైన యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా డి.ధనలక్ష్మి, కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వరమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నిక అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కోశాధికారిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షుడిగా బి.ఝాన్సీలక్ష్మీ, వి.వెంకటేశ్వరమ్మ, దుర్గా, సహాయ కార్యదర్శులుగా శీలం వాణి, లక్ష్మీరాజకుమారి, స్వాతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.


మేజర్ ధ్యాన్ చంద్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ తదితరులు

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అసోసియేట్ డీన్ మాట్లాడుతూ హాకీలో భారతదేశానికి మూడు ఒలింపిక్ బంగారు పతకాలను సంపాదించార్నారన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బ్లెస్సీసాగర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో...

బాపట్ల వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో డాక్టర్ పులి మోహనరావు, వై.అంకమ్మ, బి.మౌనిక, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ కె.లావణ్య, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జంపని హైస్కూల్‌లో....

వేమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బదిరి నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు చోట్ల ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన మండల విద్యా శాఖాధికారి-2 అంకారావు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని చూపించాలన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను విద్యార్థులకు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబును సత్కరించారు. విద్యార్థులు పిరమిడ్ రూపంలో నిలబడి పలు ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ విజయబాబు, ఉపాధ్యాయులు పార్థసారథి, సత్యనారాయణ, సత్యవతి, మధుమయి, అనిత, శాంతి, మెస్సీరాణి, నాయక్, స్వాతి, దుర్గాదేవి పాల్గొన్నారు.

యడ్లపల్లిలో...

చుండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యడ్లపల్లి శ్రీఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ దాత రావి సాయిబాబా కార్యక్రమాలను పర్యవేక్షించారు. విద్యార్థులతో భవన విజయం ప్రదర్శింపజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతంలో పని చేసి ఎందరో రాష్ట్ర, జాతీయ క్రీడాకారులను తయారుచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరి శరత్‌ను గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సాంబశివరావు, పీడీ వెంకటేశ్వరరావు, సుబ్బారావు, నాగరాజు, సామ్రాజ్యం, రమాదేవి, పాల్గొన్నారు.

హైవెండ్‌లో...

కర్లపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో శుక్రవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు పలు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన సందర్భంగా అభినందించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి సాయిమహేంద్రబాబు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాలను చైర్మన్ ఉదయచంద్రరావు, డైరెక్టర్ వెంకటజ్యోతి, చాందిని, ఆంజనేయప్రసాద్‌లు పర్యవేక్షించారు.


పలు క్రీడలలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు

వైఎస్సార్ కాలనీలో న్యాయ అవగాహన సదస్సు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కె.శ్యాంబాబు ఆదేశాలమేరకు నిర్వహించిన ఈ సదసులో ప్యానల్ న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్ పాల్గొని బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు ఎస్.శామ్యూల్ జాన్సన్, కె.జయశీల్‌బాబు, పాలపర్తి సంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష కోసం ఉద్యమించిన గిడుగు

● కలెక్టర్ జె.వెంకటమురళి


రామమూర్తి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్, అధికారులు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సు నుంచే తెలుగు భాష కోసం ఉద్యమించిన గిడుగు రామమూర్తి చిరస్మరణీయులని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత గిడుగు రామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యావహారిక తెలుగుభాష మరింత వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యమంచేసిన గొప్ప చారిత్రాత్మక వ్యక్తి రామమూర్తి అని కొనియాడారు. తెలుగు భాష కోసం గిడుగు రామమూర్తి చేసిన త్యాగాలు మరువలేనివని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. తెలుగుభాషకు వెలుగులాంటి వ్యక్తి గిడుగు రామమూర్తి అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఆర్డీవో పి.గ్లోరియా, ఎండీ సాదిక్, డీపీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధురమైనది తెలుగు భాష : ఆర్డీవో

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ భాషలన్నింటిలోకెల్లా తెలుగు అత్యంత మధురమైనదని ఆర్డీవో పి.గ్లోరియా పేర్కొన్నారు. గిడుగు రామమూర్తిని స్ఫూర్తిగా తీసుకొని దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి, గిడుగు రామమూర్తి పటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకోకపోతే జాతికి మనుగడ ఉండదన్నారు. తహసీల్దార్ షేక్ సలీమా మాట్లాడుతూ బాపట్లకు చెందిన ఎందరో కవులు తెలుగు భాషను సుసంపన్నం చేశారన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ తెలుగును ఆదరించి బాపట్ల ఖ్యాతిని నిలబెట్టాలని కోరారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ తెలుగు భాషకు బాపట్ల పురిటిగడ్డగా అలరారుతుందన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు జీవీ, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, అధ్యాపకులు హనుమాన్‌జీ, నాయకులు కర్పూరపు రామారావు, మోదుగుల శ్రీరామరెడ్డి, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు బాషాద్యమ పితామహుడు, గ్రాంధిక బాషను వ్యతిరేకించి తెలుగు వ్యవహారిక బాషను ప్రవేశపెట్టిన తెలుగుభాషకు వన్నె తెచ్చిన మహానుభావుల్లో గిడుగు వెంకట రామమూర్తి పంతులు ఒకరని గ్రోసంస్థ అధినేత, రచయిత బందబాబు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కాగిత శ్రీహరిరావు, సాహితిభారతి రచయితలు రావూరి నరసింహవర్మ, మర్రి మాల్యాద్రిరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తెలియజేశారు. సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి 162వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు జీవీ సుబ్రహ్మణ్యం, కాళీదాసు కామరాజు, సీనియర్ ట్రెజర్ బొలగాని వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మిక సేవకులు ఆంజనేయరెడ్డి, భద్రయ్య, భాస్కరరావు, కె.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు వ్యవహారిక భాష ప్రజాదరణ పొందటానికి పాఠ్య గ్రంథ భాషగా రూపొందించటానికి ప్రధాన కారకులు, తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బాపట్ల సాహితిభారతి ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, రచయితలు మర్రి మాల్యాద్రిరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళీదాసు కామరాజు, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.,

మాతృ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రేపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మాతృ భాష పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలుగు అధ్యాపకురాలు అనురాధ అన్నారు. స్థానిక అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాతృ భాష దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాష కోసం గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషా అభ్యున్నతి కోసం చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సాహిత్యంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, పి.దాసు, రవీంద్ర, ఎం.భీమయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్

● చెరుకుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం, జాతీయ కెరీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు కాటూరి వెంకటరావు, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నగరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : దేశభాషలందు తెలుగు లెస్సా అని ఎస్‌వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ మాతృభాష ఏదైన అది తల్లితో సమానమని అన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వకృత్వం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీనివాసరావు, పి.వెంకట నారాయణ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● కర్లపాలెం ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలంలోని పెదగొల్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తెలుగు బాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అదేవిధంగా క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు ఏ.శ్రీనివాసరావు, పి.మల్లికార్జునరెడ్డి, బాపూజీరెడ్డి, ఆదంబీ, రాహుల్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక మండపాన్ని సందర్శించి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే వేగేశన పూజలు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన శ్రీభావపురి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బిల్డర్స్, వెంచర్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పిండిమర కృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, ముప్పా రమేష్‌బాబు, రత్తయ్య, షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పాంచాళవరం లడ్డూ రూ.41,500

అమృతలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాంచాళ వరంలో శ్రీరామా యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన శ్రీ విఘ్నేశ్వరస్వామి లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గమిని ప్రభాకరరావు మనుమడు చైతన్యసాయి రూ.41,500కు లడ్డూను అత్యధికంగా పాట పాడి దక్కించుకున్నాడు. యూత్ సభ్యులు, గ్రామస్తులు లడ్డూ దక్కించుకున్న భక్తుడి కుటుంబ సభ్యుడు లక్ష్మణరావును సత్కరించారు. గోవాడలో ఉత్తరం ఎన్టీఆర్ బొమ్మ వద్ద శ్రీరామా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద నిర్వహించిన వేలం పాటలో దివంగత దొప్పలపూడి ప్రసన్నకుమార్ మిత్ర బృందం రూ.11,500లకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

వైభవంగా నిమజ్జన కార్యక్రమాలు

అమృతలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. అమృతలూరులో శివా టెంపుల్‌యూత్ ఆధ్వర్యంలో 34వ ఏట ఏర్పాటు చేసిన మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపారు. కనక తప్పెట్లతో గ్రామోత్సవం చేశారు. అఘోరాల అలంకరణలో నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఏర్పాట్లను శివా టెంపుల్ యూత్ సభ్యులు పర్యవేక్షించారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం దుండివారిపాలెం పంచాయతీ, తిమ్మారెడ్డిపాలెంలో భక్తులు వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీమహర్షి ఆశ్రమంలో గణపతి హోమం, గోపూజ

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేంద్రపురంలోని శ్రీమహర్షి ఆశ్రమగోశాలలో శుక్రవారం గణపతి హోమం, గోపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీసంపత్ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం విశిష్టపూజ నిర్వహించిన అనంతరం లక్ష్మీ గణపతిహోమం, గోపూజ జరిపారు. అదేవిధంగా సామూహిక కుబేరలక్ష్మీ కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కన్వీనర్ బి.బాబునాగేంద్ర, మామిడి రాజశేఖర్, పేరాల శేషగిరిరావు, శ్రీహరి నారాయణ, నాగవరపు పూర్ణప్రసాద్, కూనపురెడ్డి గాంధీ, తులసీ, భ్రమరాంబ, ప్రసన్నదేవి, భాగ్యలక్ష్మీ, యామిని, లక్ష్మీప్రభావతి, కోటా లక్ష్మీ, సరిత, ఉషా తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత రీ సర్వేను వేగవంతం చేయాలి : ఆర్డీవో

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మూడో విడత భూముల రీ సర్వే వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఓలేరు, పెసర్లంక, పెదలంక, పెదపులివర్రు, వెల్లటూరు, అద్దేపల్లి గ్రామాల్లోని పొలాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో ఆయా భూముల వివరాలు నమోదు చేయాలన్నారు. భూములకు సంబంధించి రైతులను పిలిపించి భూముల సర్వే చేయాలని వారి వద్ద ఉన్న ధృవపత్రాలు తీసుకుని ఆన్‌లైన్ కానీ భూములను ఎఫ్‌పీవీఎల్ఆర్‌లో తక్షణమే నమోదు చేయాలన్నారు. ఎఫ్‌పీ ఎల్ఆర్ అర్జీలను ఆన్‌లైన్ నమోదు గురించి అధికారులను ప్రశ్నించగా వారి నుంచి స్పందన లేకపోవడంతో ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ రైతు జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీటీ శాంతలక్ష్మీ, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.


మండల స్థాయి అధికారులతో రీ సర్వేపై మాట్లాడుతున్న రామలక్ష్మి

మున్సిపల్ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు


పీడీ కత్తి శ్రీనివాసరావును సన్మానిస్తున్న డీఈవో ఎస్.పురుషోత్తం తదితరులు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్పోర్ట్స్‌డే సందర్భంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించి సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ హాకీక్రీడాకారుడు ధ్యానచంద్ పేరిట ఏర్పాటుచేసిన జాతీయ స్పోర్ట్స్‌డే సందర్భంగా ప్రతి జిల్లా నుంచి ఐదు పాఠశాలలను ప్రతిభను బట్టి ఎంపిక చేసి అవార్డులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కరీముల్లా, బి.రాజశ్రీ పాల్గొన్నారు.

చింతాయపాలెం పాఠశాలకు...

కర్లపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కర్లపాలెం మండల పరిధిలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2024-2025 సంవత్సరానికి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు ప్రథమ స్థానానికి ఎంపికైందని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. స్పోర్ట్స్‌డే సందర్భంగా ఈ అవార్డును వ్యాయామ ఉపాధ్యాయుడు మద్దెన గోపికి డీఈవో శుక్రవారం అందజేశారు. చింతాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 50మంది క్రీడాకారులు 2024-2025 సంవత్సరానికిగాను పలు రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొని బంగారు, రజత పతకాలు కైవశం చేసుకున్నారని డీఈవో తెలిపారు. ఒక్కరు జాతీయ స్థాయిలో పాల్గొన్నారని అందువలన కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఈ అవార్డులను అందజేశారన్నారు. పీఈటీ మద్దెన గోపిని డీఈవో శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా ఉపవిద్యాశాఖాధికారులు గంగాధర్, సురేష్‌లు ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌వోసీ మంజూరు


మార్తమ్మ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పుట్టి మార్తమ్మ అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రిఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో మార్తమ్మకు రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును పుట్టి మార్తమ్మ కుటుంబసభ్యులకు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.

మహిళల అభ్యున్నతికి అండగా కూటమి ప్రభుత్వం

వేమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ అన్నారు. మండలంలోని జంపనిలో డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి పథకం ద్వారా పెరటి కోళ్ల యూనిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఏపీఎం శోభన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన హనీఫ్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఏపీఎం మాట్లాడుతూ, వేమూరు మండలానికి పెరటి కోళ్ల యూనిట్లు 60 మంజూరయ్యాయని ఒక్కొక్క యూనిట్ ఖరీదు రూ.5 వేల చొప్పున ప్రతి యూనిట్‌కు పది కోళ్లు ఉంటాయన్నారు. వేమూరు గ్రామానికి 20, జంపనికి 20, చావలికి 20 యూనిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ మేరి, పలువురు డ్వాక్రా సంఘాల నేతలు, సభ్యులు పాల్గొన్నారు.


జంపనిలో డ్వాక్రా సంఘాల మహిళలకు పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న హనీఫ్

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

రేపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ ఎంఎల్ నాయకురాలు ఎం.శోభారాణి అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో పోలీస్‌కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహిస్తామని అన్నారు. సీపీఎం ఎల్ రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.కిషోర్, కె.ఆశీర్వాదం, కె.రమేష్, ఈశ్వరరావు, సుబ్బారావు, సీహెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ప్రణాళిక నిధులు వినియోగించాలి

● దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉప ప్రణాళిక నిధులు దళిత గిరిజనుల అభివృద్ధికి వినియోగించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. పట్టణంలో శుక్రవారం దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీల అత్యాచార నిరోధక చట్టం, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక అమలుపై జిల్లా కన్వీనర్ భగవాన్‌దాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో దేవకుమార్ మాట్లాడుతూ రక్షణ, అభివృద్ధి కోసం రూపొందించిన ఈ చట్టాలు సమర్థవంతంగా అమలు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులు పొంది ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న పథకాలను అర్హులు అందుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. 100శాతం ఖర్చు చేసేలా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకుడు యాతం మోజెస్‌రాజు, న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్, మహిళా కో ఆర్డినేటర్ హేమలత, ఏరియా కో ఆర్డినేటర్ శ్రీలత, నాయకులు దేవరకొండ రాము, గుదే రాజారావు, కంచర్ల చిట్టిబాబు, కోలా శరత్, కాగిత కోటేశ్వరరావు, నరసింహులు, ప్రసాద్, శంకరప్రసాద్, ప్రభాకరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లపై తిరిగితే చర్యలు : ఎంవీఐ



ట్రాక్టర్‌ను ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి, కిషోర్‌బాబు, సిబ్బంది

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో రోడ్లమీదకు వస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి హెచ్చరించారు. ఆర్టీవో టీకే పరంధామరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దమ్ము చక్రాలతో ట్రాక్టర్‌లు రోడ్లపై ప్రయాణించటం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. రోడ్లపైకి వచ్చేటప్పుడు టైర్లతో మాత్రమే ప్రయాణించాలని ట్రాక్టర్ యజమానులకు సూచించారు. నగరం పరిసరప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి రెండు ట్రాక్టర్లకు అపరాధ రుసుము విధించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వాహనాల తనిఖీ అధికారి కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏఐ 2.0పై ఒక రోజు శిక్షణ

కొల్లూరు ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు ఉన్న అన్ని గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఆయుష్మాన్ భారత్‌పై శిక్షణ

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్‌లకు నిర్వహించిన ఈ శిక్షణలో డిజిటల్ మిషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్ఎస్ పద్మావతి, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, నోడల్ ఆఫీసర్ సుశీల, బాపట్ల ఇన్‌చార్జి ఫణీంద్ర పాల్గొన్నారు.

డీజే వాహనం తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

కొల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీజే వాహనం కరెంటు వైర్లకు తగిలి విద్యుత్ స్తంభం విరిగిపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి లంక గ్రామాలకు డీజే వాహనం వెళుతుండగా నక్కపాయి వద్ద డీజే బాక్సులకు సంబంధించిన కర్రలు విద్యుత్ వైర్లకు తగిలిన వాహనం ముందుకు వెళ్ళడంతో విద్యుత్ స్తంభం విరిగిపడిపోయింది. దీంతో పక్కన ఉన్న ఒక గృహానికి, వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రినగర్‌కు చెందిన నాగుల రాధ స్కూటీపై వెళుతుండగా సూర్యలంకరోడ్డులో వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టటంతో తీవ్ర గాయాలయ్యాయని పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. క్షతగాత్రురాలు ఆసుపత్రిలో చేరి ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రూ.77,77,777..

పెదనందిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా..లంబోదరుడికి వివిధ అలంకరణలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. నాగులపాడులో శ్రీ రామ యూత్ ఆధ్వర్యంలో 15 వార్షికోత్సవం సందర్భంగా గణనాథుడిని రూ.77,77,777ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు.



గాజువాక గణపతికి.. భారీ లడ్డూ నివేదన


తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో లక్ష చీరలతో చేసిన గణపతికి నైవేద్యంగా భారీ లడ్డూని తెనాలిలోని చెంచుపేట శ్రీ మాతా ఫుడ్ ప్రొడక్ట్స్ యజమాని ఉప్పల నందకిషోర్ చేయించారు. రెండు వేల కేజీల బరువు కలిగిన ఈ లడ్డూని శివలింగం ఆకృతిలో .. ఎనిమిది అడుగుల ఎత్తులో 15 మంది నిపుణులు నాలుగు రోజులు శ్రమించి తయారు చేశారు. ఇంత భారీ సైజులో గణపతికి లడ్డూ ప్రసాదం నివేదన చేయడం..గిన్నిస్ రికార్డు సాధించేందుకు అవకాశం ఉంటుందని మిఠాయి దుకాణం యజమాని అభిప్రాయపడుతున్నారు. లడ్డూని గాజువాక తరలించేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు.



'ధన'పతి

● రూ 22 లక్షల కరెన్సీతో విఘ్నేశ్వరునికి విశేష అలంకారం

నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట కాకతీయ నగర్‌లోని శ్రీ సాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి శుక్రవారం రూ.22 లక్షల నగదుతో విశేష అలంకారం గావించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రూ.2.35 కోట్ల నగదే.. తోరణాలు, పుష్పాలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం రూ.2.35కోట్ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక వ్యాపారుల సహకారంతో ఈ ఏడాది భారీ గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేసి ధన గణపతిగా అలంకరించారు. పూల మార్కెట్ సెంటరులోని కస్తూరి కంగన్ హాలు వద్ద ఏర్పాటు చేసే ఈ వినాయకుడిని ఏటా కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. 19 ఏళ్ల నుంచి సంకా బాలాజీ గుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తున్నారు. రూపాయి నోటు దగ్గరి నుంచి రూ.500 కరెన్సీ నోట్లతో పువ్వులు, తోరణాలను తయారు చేసి అలంకరించారు.



ద్యానబుద్ధ ప్రాంగణంలో త్రివిధ దళాల బృందంతో స్థానిక అధికారులు

బుద్ధుడి చూపిన మార్గంలో.. త్రివిధ దళాల బైక్ ర్యాలీ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు అందించిన శాంతి, కరుణ, దయ మార్గాలను నలు దిశలా వ్యాప్తి చేసేందుకు భారత త్రివిధ దళాల అధికారులు ఆరుగురు శుక్రవారం అమరావతిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైజాగ్‌లో ప్రారంభమై.. ఈ బుద్ధ సర్క్యూట్ ర్యాలీ రాజమండ్రి, విజయవాడ, అమరావతి, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు వరకు జరుగుతుంది. రాహుల్ పాటిల్ కన్వీనర్‌గా బిమ్‌స్టెక్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ యాత్రలో పాల్గొన్నారు. అమరావతిలో ధ్యాన బుద్ధ ప్రాజెక్టు సందర్శించిన అనంతరం ర్యాలీని తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య, టూరిజం అధికారి నాయుడమ్మ, మేనేజర్ మణికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పురాతన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషణకు బుద్ధ సర్క్యూట్ పేరుతో ఈ యాత్ర ఉపకరిస్తుందని రాహుల్ పాటిల్ పేర్కొన్నారు. ఈ యాత్రకు విదేశాంగ, గృహ మంత్రిత్వ శాఖలు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, నలందా యూనివర్సిటీ, బిమ్‌సెక్ట్ సెక్రటేరియట్ మద్దతు ఇవ్వడం ద్వారా భారతదేశం ఐక్యత, ప్రాంతీయ సాంస్కృతిక దౌత్యం పట్ల ఉన్న దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణి పాల్గొన్నారు.

టీసీలే జనరల్ టిక్కెట్ ఇస్తారు

● రైల్వే బోర్డు ప్రత్యేక సాఫ్ట్‌వేర్
● చేతికి హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్
● తప్పనున్న క్యూలైన్ కష్టాలు

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో జనరల్ టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ ఏటీవీఎం, యూటీఎస్ వంటి ఆన్‌లైన్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ నేటికీ ప్రధాన రైల్వేస్టేషన్లలో కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రైల్వే టిక్కెట్ తనిఖీ సిబ్బందికి ఒక హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్‌ని ఇచ్చి ప్లాట్‌ఫాం వద్దనే జనరల్ టిక్కెట్‌లను జారీ చేసే బాధ్యతలు కేటాయించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో ట్రయల్ రన్ కూడా నిర్వహిస్తున్నారు. రాబోయే పండగల సీజన్‌లో రద్దీ పెరగనున్న దృష్ట్యా ఆలోపే టీటీఈలు జనరల్ టిక్కెట్‌లు జారీ చేసే సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ భావిస్తోంది. దీని వల్ల అటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు ఇటు రైల్వేకు ఆదాయం వస్తుంది.

క్యూలైన్ కష్టాలకు చెక్..


టీటీఈలు హ్యాండ్‌సెట్లు అందుబాటులోకి రాని రోజుల్లో చేతివాటం ప్రదర్శించేవారు. నేటికీ కొంతమంది ఈఎఫ్‌టీల విషయంలో ఇదే వైఖరిని కలిగి ఉన్నారు. దీని వల్ల రైల్వే శాఖ ఆదాయం కోల్పోతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల నుంచి హ్యాండ్ సెట్ల విధానాన్ని రైల్వే శాఖ అందు బాటులోకి తీసుకొచ్చింది. దీనికి అదనంగా వైఫై/బ్లూటూత్ సదుపాయంతో మెడలో ధరించే ఒక ప్రింటర్‌ని కనెక్టు చేసి వాటి ద్వారా జనరల్ టిక్కెట్లు జారీ చేసే సాఫ్ట్‌వేర్‌ని అభివృద్ధి చేసింది. ఈ సదుపాయం వల్ల ప్రయాణికులు టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్‌లో నిలబడకుండా నేరుగా టీటీఈ వద్దకు వెళ్లి ఎక్కడికి ప్రయాణించదలిచాలో చెబితే వెంటనే నగదు చెల్లించుకొని జనరల్ టిక్కెట్ జారీ చేస్తారు. దీని వల్ల రైల్వేకు టిక్కెట్ కౌంటర్లు, యూటీఎస్ యాప్, ఏటీవీఎంలతో పాటు టీటీఈల ద్వారా కూడా ఆదాయం వస్తుంది.



హ్యాండ్‌సెట్, ప్రింటర్‌తో టీటీఈ



సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల వరద నీరు

సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

విజయపురిసౌత్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,211, 20 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 6 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,43,862, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,88,302 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 2,88,302 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ఉత్పత్తి ఆపేశాం

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 గేట్లకు గాను 17 రేడియల్ క్రస్ట్ గేట్ల స్పిల్‌వే నుంచి పులిచింతలకు 2,80,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 15 గేట్లు 3 మీటర్లు, 2 గేట్లు 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 2,77,316 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపివేశామన్నారు. రిజర్వాయర్‌లో 74.42 మీటర్ల మేర నీరుండగా.. 6.035 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు, ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు ప్రధాన వాగుల నుంచి శుక్రవారం 3,08,838 క్యూసెక్కుల వరద శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,96,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,425 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థులపై పెరుగుతున్న సబ్జెక్ట్ భారం!



వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో విద్యార్థులు, బోధన సిబ్బంది

● హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యార్థులపై సబ్జెక్ట్ భారం పెరుగుతోందని, ఇది ఆందోళన కలిగించే అంశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వైద్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం ఈదుల పాలెంలోని కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీబీఎంఈ పాఠ్యక్రమంలో ఉన్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ పార్ట్ 1, పార్ట్ 2 విద్యార్థులు ఎదుర్కొంటున్న సిలబస్ ఇబ్బందులు, పార్ట్ 2 విద్యార్థులపై అధికమైన సబ్జెక్టుల భారం గురించి ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారానికి విశ్వవిద్యాలయం విద్యార్థుల పక్షానే నిలుస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల సంఖ్య దృష్ట్యా మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అవసరమన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఏటా ఒకసారి వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. వైద్యులు నిరంతర విద్యార్థులుగా ఉంటేనే వృత్తిలో రాణిస్తారని స్పష్టం చేశారు. నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమాలలో పాల్గొనడం, పరిశోధనలో చురుకుగా భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు..

విజ్ఞాన్ నిరుల విద్యార్థినులు

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 30 మంది విద్యార్థినులు వివిధ విభాగాల పాల్గొన్నారని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ హ్యాకథాన్ విద్యార్థినుల తర్కిక ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా మలచుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ధైర్యంగా సృజనాత్మక సవాళ్లను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆర్అండ్ డి.డాక్టర్ వి. లక్ష్మణ్ నారాయణ, డాక్టర్ సత్య సందీప్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు

సంపూర్ణ క్రమశిక్షణ వీవీఐటీయూ నినాదం



సరస్వతి దేవికి పూజలు చేస్తున్న వర్సిటీ చాన్సలర్ విద్యాసాగర్, విద్యార్థులు

● చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మంచి నడవడికతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని వీవీఐటీయూ విశ్వసిస్తుందని చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. క్రమశిక్షణతో కూడిన అధునాతన విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటుగా విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను విశ్వవిద్యాలయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో 2025-26 ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రవేశ పరీక్షల్లో టాప్ ర్యాంకర్లగా నిలిచి, ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ వీవీఐటీ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన వెంటనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. వారి నమ్మకం తమపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం లోకమంతటా ప్రసిద్ధి చెంది తమ విద్యార్థులు గర్వంగా చెప్పుకోగలిగేంత వరకూ విశ్రమించమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లడుతూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు సీమన్స్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం వల్ల విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ వై. మల్లికార్జున రెడ్డి మాట్లడుతూ మెరుగైన భవిష్యత్తుకు విద్యార్థుల కృషి కీలకమన్నారు. వారి కృషికి సరిపడా అన్ని వసతులను వీవీఐటీ విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని వారి ఉపాధి, ఉన్నత విద్య కొరకు ఉపాధికల్పన, శిక్షణ విభాగం పనిచేస్తుంద న్నారు. మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కొరకు పనిచేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని అన్నారు. అడ్మిషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లడుతూ లక్ష్యాన్ని మొదటి నుంచి నిర్దేశించుకుని, విద్యార్థులు 100 శాతం తరగతులకు హాజరుకావాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ కోర్సులకు మంచి స్పందన లభించిదని అన్నారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్. సెక్రటరి సూర్యదేవర బదరిప్రసాద్, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రాజధానిలో రైతులకు ప్లాట్లు



రైతులకు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు ఇస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

తుళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు ఈ-లాటరీ విధానలో 75 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు అందజేశారు. లాటరీ కార్యక్రమం శుక్రవారం విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్‌రాజు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీఎస్‌బీ వసంతరాయుడు, పెనుమాక డిప్యూటీ కలెక్టర్ ఏ.జి.చిన్నికృష్ణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శివశంకర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 75 ప్లాట్లలో 45 నివాసానికి కాగా 30 వాణిజ్య ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. 33 మంది రైతులు, భూయజమానులకు ఆన్‌లైన్ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్‌రన్ వేసిన తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రకియ నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ పంచాయతీలో చెత్త కుప్పలు

● అలంకార ప్రాయంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ● పట్టించుకోని అధికారులు



చినకోండ్రు పాడులోని సంపద తయారీ కేంద్రం



చినకోండ్రుపాడు డొంక రోడ్డులో చెత్త కుప్పలు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డు నిర్వహణలో డిల్లీ స్థాయిలో అవార్డును అందుకోవడంతో పాటు మండలంలోనే ఆదర్శంగా నిలిచిన ఉత్తమ పంచాయతీ నడింపాలెం ఇప్పుడు అధమ స్థానానికి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల పర్యవేక్షణలో లోపమో... ఏమో కాని మండల పరిధిలోని నడింపాలెం పంచాయతీపైకి డాబుగా కనిపిస్తున్నా.. లోపలంతా కుళ్లు వాసన కొడుకొంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చి అమలుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే గ్రామస్థాయిలో అధికారులు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లపై చిన్నచూపు చూస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చడం లేదు. ఉపయోగపడే ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం అమ్ముకుంటూ మిగిలిన వ్యర్థాలను ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ పడేస్తున్నారు. ముఖ్యంగా రావిపాటివారిపాలెం సమీపంలో కాలువ వెంట వ్యర్థాలను పడేయడంతో రోడ్డు వెంట తిరిగే వారితో పాటు సమీపంలో ఉండే గృహాల వారికి దుర్వాసన వెదజల్లుతుంది. అంతే కాకుండా కుక్కలు బీభత్సం చేస్తూ పాడు చేస్తున్నాయి. అంతే కాకుండా కోండ్రుపాడు దాటిన తరువాత డొంకరోడ్డు బారుకి చెత్తను డంప్ చేస్తున్నారు.



ప్రత్తిపాడు, చినకోండ్రుపాడు రోడ్డులో చెత్త గుట్టలు

అవీ..ఇవీ..

అంతరాయం లేని విద్యుత్ సరఫరా



విద్యుత్ లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా ధ్యేయంగా కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ(బలరామకృష్ణాపురం)లో విద్యుత్ ఆధునీకరణ పనులను ఈఈ మస్తాన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా నాణ్యమైన విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్‌కు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఈఈ దామోదరం, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందను ఢీకొట్టిన లారీ

మేదరమెట్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదురు గొర్రెల మందను లారీ ఢీ కొన్న ఘటనలో రెండు గొర్రెలు చనిపోయాయి. శుక్రవారం సాయంత్రం రోడ్డు అంచులో వెళుతున్న గొర్రెల మందను హైదరబాద్ నుంచి చైన్నై వైపు వెళుతున్న లారీ మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదురు గొర్రెల మందను తొక్కించుకుంటూ వెళ్లింది. రెండు గొర్రెలు లారీ టైర్ల కింద నుజ్జు నుజ్జు అయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా నడపడం వలనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గొర్రెల యజమాని వెంకటరామయ్య గొర్రెల మృతిపై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు.

పాల ఆటోను ఢీ కొన్న గుర్తు తెలియని వాహనం

మేదరమెట్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల నుంచి జాగర్ల మూడి వారిపాలేనికి పాలు తీసుకువెళుతున్న ఆటోను గుర్తు తెలియని వాహనం గురువారం ఢీకొంది. ఆటో బోల్తా పడి పాలు అన్ని నేలపాలయ్యాయి. మేదరమెట్ల పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఒంగోలులో స్కానింగ్ సెంటర్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో



ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నగరంలోని ప్రైవేటు వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మొత్తం తొమ్మిది సెంటర్లను పరిశీలించారు. ఆస్పత్రులలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులు చూశారు. అక్కడ రోగులకు అందిస్తున్న సేవలతోపాటు వాటి వివరాలు నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరు ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్‌ను ఎస్టాబ్లిస్మెంట్ యాక్ట్ 2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైతే నమోదు చేసుకోరో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్ అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రులు అందిస్తున్న సేవలు వాటికి వారు వసూలు చేసే ధరల పట్టికలను కూడా బోర్డుల్లో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శ్రావణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

కొండపి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై మద్యం మత్తులో ఉన్న యవకులు దాడి చేయడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. డ్రైవర్ బొమ్మిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి కొండపి నుంచి ఒంగోలుకు బస్సును తీసుకొని ప్రయాణికులతో వెళ్తుండగా, వెన్నూరు వద్ద ఒంగోలుకు చెందిన కుంచాల శ్రీనివాసులు, అతని స్నేహితుడు కలిసి మద్యం తాగి రోడ్డుపై అడ్డంగా తమ ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉన్నారు. వాహనాన్ని పక్కకు తీయాలని డ్రైవర్ కోరగా ఆగ్రహించిన యువకులు అతడిని బస్సు నుంచి లాగి కింద పడేశారు. అనంతరం దాడి చేశారు. దీంతో బస్సులోని మహిళలు, వెన్నూరు గ్రామంలోని కొందరు వ్యక్తులు నిందితులకు దేహశుద్ధి చేసి కొండపి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. డ్రైవర్ పిర్యాదు మేరకు ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను కొండపి వైద్యశాలకు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ మునిసిపల్ వర్కర్స్ అం డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభలో నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బ రాయుడు(మార్కాపురం) ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఒంగోలు), సభ్యు లుగా కె.సామ్రాజ్యం, ఇట్లా నాగయ్య, చీమకుర్తి ఏడుకొండలు, టి.విజయమ్మ, బి.కోటేశ్వరరావు, సీహెచ్.ప్రసాద్, పి.పద్మ, బి.భారతిలను ఎన్నుకున్నారు. అనంతరం మహసభలో చేసిన తీర్మానాలను శుక్రవారం పత్రికలకు విడుదల చే శారు. మునిసిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, గత సమ్మె కాలపు వే తన జీవోను ఇవ్వాలని, కొవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, పీ ఎఫ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల అంగీకారంతోనే భూములను లీజుకు తీసుకోవాలి : జేసీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల అంగీకారంతోనే అభివృద్ధి పనులకు భూములను లీజుకు సేకరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం పీఎంకేయూఎస్‌యూఎం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరేషన్(ఎఫ్ఎల్ఎస్) కార్యక్రమం అమలుపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ పథకం కింద భూ కేటాయింపుల కోసం 121.75 ఎకరాల ప్రభుత్వ భూమి, 378 ఎకరాల పట్టాభూమిని గుర్తించామన్నారు. పట్టా భూముల రైతుల అంగీకారంతో ఆయా భూములను లీజు ఆధారంగా సేకరించి భూ కేటాయింపులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓ బులేషు, మార్కాపురం సబ్‌కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగో లు, కనిగిరి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జనాలు

● ప్రారంభమైన వినాయక విగ్రహాల నిమజ్జన సందడి ● పలుచోట్ల కొనసాగుతున్న పూజలు



అద్దంకి నుంచి నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనము ల సందడి ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలో సుమారు 40 వరకు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా శు క్రవారం ఐదు వి గ్రహాల నిమజ్జనాలు చేశారు. అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డులో గుండా ఊరేగింపు నిర్వహిస్తూ గుండ్లకమ్మ నది లో నిమజ్జనాలు చేశారు. సిఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వినాయక నిమజ్జన ఊరేగింపు, నిమజ్జనం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాలలో కూడా వినాయక వి గ్రహాల నిమజ్జనం చేశారు. నాగులపాడు లో ఆనవాయితీ సుమారు రెండు దశాబ్దాల కాలం నుండి ఏర్పాటు చేస్తున్న వినాయక వి గ్రహాల వద్ద నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో, నాగులపాడు తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకర్షణ గా ఉన్నాయి. రెండు వేర్వేరు రోజులలో నిర్వహించే వినాయక నిమజ్జన ఊరేగింపులకు కూడా ప్రత్యేకత ఉంటుంది. ఆయా రోజులలో వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు తిలకించేందుకు అద్దంకి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకిస్తుంటారు.

బల్లికురవ, : వినాయకచవితి పండగ సందర్బంగా పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను శుక్రవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. మండ లంలోని నక్క బొక్కలపాడు, మల్లాయ పాలెం, కొప్పెరపాలెం గ్రామాలలో ఉదయం నుండే ప్రత్యేక మేళాలతో గణనాధుడిని ప్రత్యేక వాహనాలలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దగ్గరలో ఉన్న వీర్ల చెరువులో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామాలలో నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు చోటు చుసుకోకుండా ఎస్ఐ నాగరాజు పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం ను శు క్రవారం 10 రూపాయల నోట్ల తో ప్రత్యేకంగా అలంకరించారు. వెయ్యి నోట్ల తో వి గ్రహన్ని అలంకరించారు. కొం డ్రగుంట శేషయ్య, ఈశ్వరమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





గుండ్లకమ్మకు తరలిస్తున్న వినాయక విగ్రహం, రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి నోట్లతో అలంకరణ

వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

● జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక ● విస్తృతంగా రేషన్‌దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఆర్వో ప్లాంట్ల తనిఖీ చేసిన అధికార యంత్రాంగం



మద్దిపాడులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ



నాగులుప్పలపాడులో పెట్రోల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

మద్దిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను సక్రమంగా నిర్వహించని డీలర్లపై చర్యలు తప్పవని జేసీ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మద్దిపాడులోని రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్బంగా జేసీ మాట్లాడుతూ రేషన్‌షాపుల ద్వారా నిర్వాహకులు నిత్యావసర సరుకులు బాధ్యతగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, డీలర్ చుంచు హరిబాబు కళ్యాణి పాల్గొన్నారు. అనంతరం ఎరువుల దుకాణాలను, పెట్రోలు బంకులను తనిఖీ చేశారు.

- జరుగుమల్లి (కొండపి): మండలంలోని పలు రేషన్ షాపులను తహసీల్దార్ పి.మురళి శుక్రవారం తనిఖీ చేశారు. చిర్రికూరపాడులోని పెట్రోల్ బంకును, ఐటీసీ ఆర్వో ప్లాంటును పరిశీలించారు. వినియోగదారులను మోసం చేసి, అధిక ధరలకు అమ్మినా.. కల్తీ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా నిర్వాహకులను ఆయన హెచ్చరించారు.

- పొన్నలూరు: పొన్నలూరులోని ఎరువుల దుకాణాలను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న నిల్వలు, ధరల వివరాలను పరిశీలించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లోని ఎరువులకు సరైన పత్రాలు లేనందున రూ.55,000 విలువైన నిల్వను, వేణుగోపాల్ ఫెర్టిలైజర్స్‌లో స్టాకును ఈ పాస్‌బుక్‌లో నమోదు చేయనందున రూ.2,27,571 విలువైన సరుకు అమ్మకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఏవో వి.రాము తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎప్పటికప్పుడు నిల్వలను చూపించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో తహసీల్దార్ వీఎస్.పాల్, కానిస్టేబుల్ కృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.

- నాగులుప్పలపాడు: పెట్రోలు బంక్‌లు, వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం నాగులుప్పలపాడులోని పెట్రోలు బంక్, మద్దిరాలపాడులోని వాటర్‌ప్లాంట్‌ను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సదరు పెట్రోలుబంక్‌లో స్టాక్‌బోర్డు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సౌకర్యం, తాగునీరు, ఇంధనం కొలతలు, నాణ్యతను పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌లో నీటి నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉప్పుగుండూరులోని మనగ్రోమోర్‌ను ఎరువుల దుకాణాన్ని ఏవో వెంకట్రావుతో కలసి తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో సుబ్బరామయ్య పాల్గొన్నారు.

- సంతనూతలపాడు: మండలంలో శుక్రవారం తహసీల్దార్ నారాయణరెడ్డి పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లను, రేషన్‌షాపులను తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెంట్లు, రేషన్ డీలర్లు, పెట్రోల్ బంకుల వద్ద ఎక్కడైన సరే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతనూతలపాడులో ఎరువుల షాపులను ఏవో పావని తనిఖీ చేశారు.

అధికారులు.. మరణ శాసనం

(5వ పేజీ తరువాయి)

ఆమెకు ప్రయోజనం దక్కలేదు. భారతీదేవిలా చాలామంది వృద్ధులను మృతుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు బాధితులు ముందే మేల్కొని సరి చేయించుకున్నారు. చాలామందికి విషయం తెలియక ఆలస్యం గా అధికారులను సంప్రదిస్తున్నారు. ఇలా మృతి చెందినట్లు చూపించిన వారి సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు వాపోతున్నారు.

గడువు ముగిసినా...

అన్నదాత సుఖీభవ పథకం అమలులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి వినతుల స్వీకరణకు ఈ నెల 20 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 967, పల్నాడు జిల్లాలో 2145, బాపట్ల జిల్లాలో 1617 మంది అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువ శాతం మండల వ్యవసాయ అధికారులు క్లియర్ చేశారు. పల్నాడు జిల్లాలో 1952, గుంటూరు జిల్లాలో 918, బాపట్ల జిల్లాలో 1310 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ లాగిన్‌కి వెళ్లిన అర్జీలలో చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో తహసీల్దారు లాగిన్‌లోకి 56 అర్జీలు వెళ్లగా కేవలం 15 మాత్రమే పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 19 అర్జీల్లో 3, బాపట్ల జిల్లాలో 46 అర్జీల్లో 23 మాత్రమే తహసీల్దార్లు పరిష్కరించినట్లు సమాచారం.

బార్లు మాకొద్దు బాబోయ్

(5వ పేజీ తరువాయి)

రూ.5,10,000 చెల్లించాల్సి ఉండడం వెనకడుగుకు కారణంగా ఉంది. తొలుత ఇచ్చిన గడువు పెంచడంతో పాటు, ఆశావహులతో సమావేశాలు, ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారితో దరఖాస్తుల వేయమనే సంప్రదింపులు ఇలా అన్ని వైపుల నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించినా గడువు ముగిసే సమయానికి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం కలెక్టరేట్ వేదికగా బార్ల లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తుదారులంతా ఉదయం 8 గంటలకే ఆయా కలెక్టరేట్లకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే మిగతా వాటి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందున్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

- బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నాలుగు బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలో ఓ బార్‌కు 5, చీరాలలో ఓ బార్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. రేపల్లె, బాపట్లలో గీత కార్మికులకు బార్లు కేటాయించగా రేపల్లెలోని బార్‌కు లాటరీ తీయడానికి కావాల్సిన దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో నాలుగు బార్లు మాత్రమే లాటరీకి అర్హత సాధించాయి.

- గుంటూరు జిల్లాలో 110 బార్లకు గడువు ముగిస్పేటికి 48 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 35 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వీటికి మాత్రమే లాటరీ నిర్వహణకు అర్హత సాధించాయి. జిల్లాలో గౌడ సంఘానికి పది బార్లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. ఈ సామాజిక వర్గానికి కేటాయించిన పది బార్లకు లాటరీ అర్హత పొందాయి.

- పల్నాడు జిల్లాలో 49 బార్లకు 65 దరఖాస్తులు వచ్చాయి. అందులో కేవలం 16 బార్లకు మాత్రమే లాటరీ నిర్వహించే అర్హత ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ సంఘానికి ఐదు బార్ల కేటాయించగా, 22 దరఖాస్తులు వచ్చాయి. ఐదు బార్లు లాటరీ నిర్వహించేందుకు అర్హత పొందాయి.

గుప్తనిధుల ముఠా అరెస్టు

మొత్తం ఆరుగురు పట్టుబడ్డారు

పరారీలో సూత్రధారి, మరో ముగ్గురు

డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామంలోని కొండపైన ఉన్న రంగనాయకస్వామి దేవాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కనిగిరిలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ కేసు వివవాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 22న నందనవనంలోని అడవిలో కొండపై ఉన్న మల్లప్పశెల రంగనాయకస్వామి ఆలయ గర్భగుడి కింద బంగారు గని ఉందని గుడి వెనుక భాగం నుంచి గర్భగుడి కిందకు పెద్ద గుంత తీశారు. అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో ఓ గ్రామస్థుడికి వారు కనిపించారు. అనుమానం వచ్చిన గ్రామస్థుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో తన పర్యవేక్షణలో సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్ఐ మాధవరావు, పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో హెచ్ఎంపాడు మండలానికి చెందిన గిద్దా ఏడుకొండలు, కండె మధుబాబు, సుంకిశాల రీగన్, కనిగిరి పట్టణానికి చెందిన పాలపర్తి రాజు, షేక్ పాచ్చావలి, పామూరు పట్టణానికి చెందిన వేముల ఏడుకొండలు ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు వెల్లడించారు. సూత్రధారి మరో ముగ్గురు పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు.

సూత్రధారిని త్వరలో పట్టుకుంటాం

నందనవనంలోని దేవాలయంలో తవ్వకాలకు పాల్పడిన ముఠాను అరెస్ట్ చేసి విచారించగా కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామ సర్పంచ్, వైసీపీ నేత కాసుల పెద్దగురవయ్య గుప్తనిధుల తవ్వకాలకు ప్రధాన సూత్రధారి అని తేలిందని డీఎస్పీ తెలిపారు. పాడుబడిన దేవాలయాలను ఎంచుకుని వాటిల్లో నిధుల కోసం తవ్వకాలు చేపడుతూ వచ్చిన డబ్బుతో జల్సాగా తిరుగుతుంటాడని పేర్కొన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఓ ముఠాను తయారు చేసుకున్నాడని, అందులోని ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారన్న విషయాన్ని తెలుసుకున్న పెదగురవయ్య పరారయ్యాడని తెలిపారు. అతనితోపాటు వెలిగండ్లకు చెందిన కారుమంచి ఖజావలి, శివారెడ్డి, ఎలికావారి పల్లికి చెందిన పగడాల చెన్నరాయుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సూత్రధారిని కలుగు నుంచి బయటికి తీసుకువచ్చి అరెస్ట్ చేస్తామని తెలిపారు. తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం అందగానే అప్రమత్తమై చాకచక్యంగా నిందితులను పట్టుకున్న సీఐ ఖాజావలి, ఎస్ఐ మాధవరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మొక్కలను నాటిన జనసేన నాయకులు



మొక్కలను నాటుతున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జన సేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరులోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకలు శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సొ సైటీ డైరెక్టర్ పెంట్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌క ళ్యాణ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరావు, అనిల్, అరుణ్, సాయి, శ్రీను, సుభాష్, మల్లెపూల గోపి, మాదాసు సుభాష్, వంశీ పాల్గొన్నారు.

బీడు భూముల ఆక్రమణకు యత్నం

వెలిగండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లిలో పశువుల బీడు భూములను ఆక్రమణకు యత్నించారు. రైతులు అడ్డుకొని శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెం.104-2లో 30 ఎకరాలను కొంతమంది గ్రామస్థులు, బయటవ్యక్తులు యంత్రాల సహాయంతో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పూర్వం నుంచి రెవెన్యూ రికార్డుల్లో పశువుల బీడు భూమిగా నమోదై ఉందని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులు దొంగ పట్టాలు సృష్టించి కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రూ.60 లక్షల విలువైన 30 ఎకరాలకు పైగా ఆక్రమిస్తున్నారని తహసీల్దార్‌కు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జేఎన్టీయూపై శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

కేటాయింపునకు ఆమోదం తెలిపాయి. అయితే వర్సిటీ పాలక మండలి ఆ నిధుల విడుదలపై కనికరం చూపడంలేదు. బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహల పనుల పూర్తికి, 500 మీటర్ల పొడవును ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.11.20 కోట్లు విడుదల చేస్తేనే వసతిగృహాల పనులు ముందుకు సాగుతాయి. వెంటనే నిధులు విడుదల చేస్తే కనీసం రెండు మూడు నెలల్లో వసతిగృహాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై నేటి వరకు వర్సిటీ నిర్ణయం తీసుకోలేదు.

అరకొర వసతులతోనే నిర్వహణ

ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన జేఎన్టీయూ కళాశాలలో అరకొర వసతులతోనే నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా కేవలం తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం జరగలేదు. రూ.33 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే కళాశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించి పాలక మండలి ఆమోదం తెలిపి ఏడాది అయినా నిధులు విడుదల కాలేదు. వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన కళాశాల కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి సాధిస్తుందని, వసతులు సమకూరుతాయన్న విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. కనీసం వసతిగృహాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తడిసి ముద్దయిన నగరం

● వర్షానికి పలు ప్రాంతాల్లో నిలిచిన నీరు



ఒంగోలులో జలమయమైన వీధి

ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. దాంతోపాటు నగరంలోని పలు కాలనీల్లో రోడ్లు అస్త్యవస్తంగా మారాయి. శుక్రవారం రాత్రి 8గంటలకు మొదలై ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు ప్రజలకి పాట్లు తప్పలేదు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి, బురదమయంగా మారాయి. నగరంలోని ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు లోతట్టు ప్రాంతాల్లో చెరువులను తలపించాయి. పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి, కొప్పోలు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీ స్టేడియంలలో నీరు నిలిచి, చెరువులు తలపిస్తుండగా, శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాం కాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, స్టేషన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

అవీ..ఇవీ..

నేడు అన్న క్యాంటీన్‌కు భూమిపూజ

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శనివారం భవన నిర్మాణ పూజ చేయనున్నారు. పర్చూరు నియోజకవర్గంలోనే తొలిసారిగా మార్టూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.61 లక్షల నిధులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. పేదలు, కూలీలు ఎక్కువగా ఉండే నాగరాజుపలి కూడలి సమీపంలోని స్థలంలో క్యాంటీన్ నిర్మాణానికి ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం ఐసీడీఎస్‌లో నూతనంగా ఉద్యోగాలు పొందిన అంగనవాడీ కార్యకర్తలకు, ఆయాలకు నియామకపత్రాలను అందజేయనున్నారు.

క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి మహిళా సదస్సు

శనివారం ఉదయం 11 గంటలకు ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి మహిళా సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే ఏలూరి ఏలూరి సాంబశివరావు పాల్గొంటారు. అనంతరం మార్కెట్ కమిటి చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రైతుల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొంటారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

బల్లికురవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఆదివారం గుంటూరు శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అనవరమైన వారికి కంటి అపరేషన్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక బస్సులలో తీసుకు వెళ్లి అపరేషన్లు చేయించి తిరిగి తీసుకు వచ్చే ఏర్పాట్లు కూడా చేశామన్నారు. శిబిరానికి వచ్చే వారు రేషన్‌కార్డు గాని అరోగ్యశ్రీ కార్డును గాని తీసుకు రావాలని వారు కోరారు.

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు

● మండల వ్యవసాయాధికారి భాస్కరరావు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో భాస్కర్‌రావు

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే అట్టి దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని పర్చూరు ఏవో భాస్కర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చెరుకూరు గ్రామంలో ఆయా ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, స్టాక్ రికార్డులో ఉన్న నిల్వలను సరిచూశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయాలు నిర్వహించినప్పుడు తప్పక బిల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున జన్మదినం సందర్భంగా అన్నదానం

మార్టూరు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు నాగార్జున జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని నాగభైరుపాలేనికి చెందిన చిన్నం చల మయ్య శనివారం మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆయనకు ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 9 అంశాల అజెండాతో సమావేశం జరుగుతుందన్నారు.

అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే చర్యలు

అద్దంకి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, మేదరమెట్ల, పంగులూరులలో నిర్వహించే అన్నగారి సంతలలో మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్‌పర్సన్ వి. పద్మావతి తెలిపారు. కొంత మంది బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి సంతలలో ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. రైతులు మాత్రమే తాము పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులు తెచ్చుకొని అమ్మకాలు చేసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు అయ్యేలా, కొనుగోలుదారులకు తక్కువ ధరకు అందేలా ముందు రోజు ధరలు నిర్ణయించనున్నట్లు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలతో ఆర్థికంగా రాణించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ సేవలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా రాణించాలని రిజర్వుబ్యాంకు ఏపీ రీజనల్ జనరల్ మేనేజర్ మహానా పేర్కొన్నారు. శుక్రవారం వేటపాలెంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ మూడు నెలల ఆర్థిక కేంద్రీకృత కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో హాజరైన బ్యాంకు అధికారులు ఖాతా, డిజిటల్ లావాదేవీలు, బీమా పెన్షన్, రుణసౌకర్యం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్రెడిట్ కార్డ్ చీఫ్ మేనేజర్ సంపత్, నోడల్ అధికారి మహేంద్ర, వెలుగు సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మైనర్‌లు పోర్న్ వీడియోల వీక్షణపై కేసునమోదు

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని మైనర్లు పోర్న్ వీడియోలు వీక్షిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు చీరాల వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్ ద్వారా సమాచారం ఎస్పీ తుషార్ డూడీకు చేరడంతో ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.





కేఆర్‌కే కళాశాలల్లో ఆకట్టుకున్న అధ్యాపకుల తెలుగు కవుల వేషధారణలు, మైలవరంలో గిడుగు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, పంగులూరులో గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

తెలుగుతోనే మన వెలుగు

● గిడుగు రామ్మూర్తి పంతులుకు ఘన నివాళి
● తెలుగు కవుల వేషధారణలో ఉపాధ్యాయులు
● ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పించిన విద్యార్థులు

అద్దంకిటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మన మాతృభాష తెలుగు చదవడం రాయడం నేర్చుకుంటే అన్ని భాషాలల్లో రాణిస్తారని, తెలుగే మన వెలుగు అని పలువురు కొనియాడారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలు పాఠశాలలు, కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధ్యాప కులు డాక్టర్ చదలవాడ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి సహకారంతో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. వాడుక బాష ఉద్యమం కోసం అందించిన సేవలను, గి రిజనుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన సవర భాషకు రచించిన వ్యాకరణాన్ని, అందుకు బ్రిటిష్ ప్రభుత్వం రావు బహదూర్ బిరుదుతో గౌరవించిందని కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాసరావు గిడుగు రామ్మూర్తి పంతులు పాత్రదారణతో పాటు పలువురు అధ్యాపకులు సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేసిన కవులు, నాటక రచయితలు, నటుల పాత్రలతో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, రోటరీ క్లబ్ సభ్యులు రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, ఎస్.షర్మిల, జి.అంజయ్య, జ్యోతిచంద్రమౌళి, రోటరీ అధ్యక్షుడు పూర్ణచంద్రావు, శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, మేజర్ ద్యాన్‌చంద్ జయంతి (క్రీడాదినోత్సవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైలవరంలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం. ఎస్.నాగేశ్వరరావు, పి.గంగాధరరావు, సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు పూర్వవైభవం రావాలి

అద్దంకిటౌన్ : తెలుగు బాషకు పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో సృజన ఆధ్వర్యంలో మాతృభాషాదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పద్య శాసనం, ఎర్రాప్రగడ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో సృజన అధ్యక్ష, కార్యదర్శులు గాడేపల్లి దివాకర్‌దత్తు, కే.అనిల్‌కుమార సూరి, జానపద కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు దేవపాలన, చంద్రమౌళి, లేవీ.ప్రసాద్, రఫీ, రఘురామశర్మ, నాగేశ్వరరావు, సీతారామశాస్త్రీ, త్రిమూర్తులు, కోటయ్య, భువనేశ్వరి, రమణారెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యావహారిక భాషకుగిడుగు రామ్మూర్తి పంతులు, క్రీడలకు ధ్యాన్‌చంద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారిచిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఐ.అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, పీడీ.హనుమయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని కుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు వాడుక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగువాడుక భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారా బాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, ఆరోగ్య పరిరక్షణ వంటి విలువలు పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. మాతృభాష ద్వారానే ఇతర భాషలను కూడా సులువుగా నేర్చుకోవచ్చని, మాతృభాష పట్ల అందరూ అభిమానాన్ని పెంపొందించుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : నేటి యువతరం మహనీయుల ఆశయాలను, ఆలోచనలను అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత హాకీ ప్లేయర్ ధ్యాన్‌చంద్ జయంతి, తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహులు గిడుగు రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఉమ్మిటి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు శ్రావణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు. దేశాయిపేటలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీ బాపూలే బలహీన వర్గాల సాంఘిక గురుకుల పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యా యులు డా.నారాయణస్వామి, ప్రత్తి వెంకట సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : అమ్మలాంటి తెలుగు భాషను ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలని, బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో మాతృభాషదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాషకు వ్యవహారికంలో తీసుకొచ్చిన ఉపాధ్యాయుడు గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థి గురుశ్యామ్ సభలో ప్రసంగించి విద్యార్థులను అకట్టుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు గంగవరపు సునీత పాల్గొన్నారు.

పర్చూరు : ప్రస్తుతం ఆంగ్లభాష మోజుతో తెలుగు భాష కొంత నిర్లక్ష్యానికి గురవుతుందని, తెలుగుభాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని ఎంఈవో శివకోటేశ్వరరావు అన్నారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాషదినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో-2 పి.వెంకట్రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుఉంటేనే మిగిలిన భాషలపై అవగాహన సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.నాగిరెడ్డి, సుబ్బారావు, హనుమంతురావు, ఈదర రాజశేఖర్, బి.సురేష్, కేవీ.ప్రసాద్, పి.నాగలక్ష్మి, బొప్పూడి ప్రసాద్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని జడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వాటి విశిష్టతను విద్యార్థులకు తెలియ జేశారు. అంతకు ముందు వేదికపై మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తిల చిత్రపటాలకు విద్యార్థులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వివిధ ఆటల పోటీలలో విజేతలకు దాత మక్కెన వీరరాఘవులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీబాయ్ ఉపాధ్యాయులు పి.కోటేశ్వరరావు, కే.పాల్‌మిల్టన్, శ్రీనివాసరావు, రమాదుర్గ తదితరులు పాల్గొన్నారు.




రామమూర్తికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, పర్చూరులో తెలుగు కవుల చిత్రపటాలతో ఉపాధ్యాయులు

రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉషారాణి



అంబడిపూడి సభలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఉషారాణి, ఏవో శ్రీనివాసరావు

బల్లికురవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే సేంద్రీయ వ్యవసాయాన్ని చేపట్టాలని డాట్‌సెంటర్ శాస్త్రవేత్త ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఆత్మ, అద్దంకి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(రైతుసంఘం) ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి పద్ధతిలో సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు . ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతు భూములలో సూక్ష్మజీవులు పెరిగేలా రైతులు గ్రామాలలో దొరికే ప్రకృతి ఎరువులను వినియోగించాలన్నారు. మార్టురు వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శనరాజు మాట్లాడుతు రైతులు ఒకేసారి సేంద్రీయ వ్యవసాయ చేయకుండా క్రమక్రమంగా ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంటలు సాగు చేస్తే ఎంతోమేలు జరుగుతుందన్నారు. అంబడిపూడి గ్రామంలోనే రైతులకు అవసరమైన సేంద్రీయ ఎరువులు రైతుసంఘం దుకాణంలో అందుబాటులో ఉంటాయని రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన బీజామృతం, ఘన జీవామృతం, ద్రవజీవామృతం వంటి కషాయాలను సొంతంగా తయారు చేసుకోవాలన్నారు. వేప నూనే వలన పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బల్లికురవ మండల వ్యవసాయశాఖ ఏవో పి.శ్రీనివాసరావు, ఏఈవో మౌలాలి, రైతుసంఘం డీఎం వందనం, అంబడిపూడి ఫార్మర్ కంపెనీ సీఈవో బి. దేవి, రైతులు దద్దాల అంజయ్య, కిలారి వెంకట్రావు, బొట్లగుంట కోటేశ్వరరావు, మరియు పలు గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: పంటసాగులో సేంద్రియ ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో శుక్రవారం సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూమిలో సమతుల్యత కోల్పోయి పంటలపై చీడపీడలు ఆశిస్తున్నాయన్నారు. ప్రతిరైతు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటసాగు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగ ప్రతినిధి శిరీష మాట్లాడుతూ బీజామృతం, ఘన, ద్రవ బీజామృతాల తయారీ, బెల్లం కషాయం తయారీవిధానం, పీఎండీఎస్ కిట్లు సాగుచేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీదేవి, స్థానిక నేతలు కాటా అంజయ్య, మక్కెన శ్రీనివాసరావు, రైతుసేవా కేంద్ర ప్రతినిధి మస్తాన్, సాయికృష్ణ, మస్తానయ్య పాల్గొన్నారు.

విద్వాన్ జ్యోతి చంద్రమౌళికి తెలుగు కీర్తి పురస్కారం



చంద్రమౌళిని సత్కరిస్తున్న అతిథులు సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భాష, సాహిత్యం, జానపద, చారిత్రక, శాసన పరిశోధనలో విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి అత్యుతమ కృషి చేశారని పాన్ ఇండియన్ సోసియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అద్దంకి రాజా అన్నారు. గురువారం రాత్రి హైదరబాద్‌లో సురవరం ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలయం(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)లో ఆ సంస్థ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, కంచర్ల గోపన (రామదాసు) పదవతరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు, గిడుగు వెంకటరామ్మూర్తి మునిమనుమడు గిడుగు కృష్ణారావుల చేతుల మీదుగా తెలుగుబాష కోసం కృషి చేసిన విద్యాన్ జ్యోతి చంద్రమౌళిని దుశ్శాలువా, ముత్యాలహారం, ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికతో పాటు తెలుగు కీర్తి పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ యనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగుభాష కోసం కృషి చేసిన, చేస్తున్న మరి కొందరికి ఈ పురస్కారాలు అందజేసి సత్కరించారు.

సుబాబుల్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న గ్రానైట్ లారీ

● మహిళా కూలీ మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు





రోడ్డు అంచులోనికి దూసుకుపోతున్న ట్రాక్టర్, మృతిచెందిన మేరమ్మ, ప్రమాదానికి కారణమైన లారీ

బల్లికురవ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాయపాలెం సమీపంలో సుబాబుల్ లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి గ్రానైట్ లారీ ఢీ కొంది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాల య్యాయి. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన 20 మంది కూలీలు శుక్రవారం సుబాబుల్ కర్రకొట్టేందుకు మల్లాయపాలెం వెళ్లారు. సుబాబుల్ కర్రను ట్రాక్టర్‌కు లోడు చేసుకొని బల్లికురవ వైపు వస్తుండగా శుక్రవారం రాత్రి గ్రానైట్ రాయి లోడింగ్‌కు వెళ్తున్న లారీ వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న నలుగురు కూలీలలో కొత్తపల్లి ఏసమ్మ, జొన్నలగడ్డ మేరమ్మ, గంధం మరియమ్మ, పందిరి చినసుబ్బయ్యలకు తీవ్రగాయాలు అయ్యాయి. సుబాబుల్ ట్రాక్టర్ రోడ్డు మార్జిన్‌లోకి దూసుకు పోయింది. కట్టెల కింద పడి ఉన్న కూలీలను హుటాహుటిన బంధువులు నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో మేరిమ్మ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నాగరాజు పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయండి

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంలో వేగంపెంచాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అధికారులతో డివిజనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ సప్లయిస్ సమస్యలు వాటికి సంబంధించిన కోర్టు కేసులు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలు, సర్వే సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రీసర్వే స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు డిప్యూటీ తహసీల్దార్లు, రీసర్వే ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు స్టీలు గ్లాసుల బహూకరణ

పందిళ్లపల్లి(చీరాల), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థిని గుత్తి మేఘన 250 స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు దీప్తి మాట్లాడుతూ 2017-18లో పాఠశాల విద్యార్థినీగా మేఘన 10 జీపీఏ సాధించినట్లు వివరించారు. అనంతరం నూజివీడులో ఐఐఐటీ పూర్తి చేసి, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఆమె ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లలితా పరమేశ్వరీ, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, భవానీ, చైతన్య, ప్రసన్నాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అర్జీలకు పరిష్కారం

● నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మహేంద్రనాథ్

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపనున్నట్లు టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ క్రమంలో 90 అర్జీలు రాగా వాటిల్లో నివేశన స్థలాల కోసం 65, పెన్షన్ల కోసం 20, ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలు ఉన్నట్లు వివరించారు. ప్రజాదర్బార్‌తో సుదీర్ఘకాలంగా నెలకొంటున్న సమస్యలకు సైతం పరిష్కారం చూపినట్లు చెప్పారు. అనంతరం దేశాయిపేట గ్రామంలో శ్రీ బాలగణపతి సేవా సమాజం వారు నిర్వహిస్తున్న వినాయక పందిరి వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

అద్దంకిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరింతగా పెంచేలా బోధనలు చేయాలని మైనంపాడు డైట్ కళాశాల అధ్యాపకులు యూ.రామకృష్ణా రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని చక్రాయపాలెం మోడల్ ప్రైమరి స్కూల్‌ను ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు, విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు, బోధనోపకరణాల వినియోగం, డిజిటల్ బోర్డులు, ఫౌండేషన్ అండ్ లిటరసీ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్, మూల్యంకన పుస్తకాలు, సిలబస్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.